తేదీ 22-06-1987న ప్రశాంతినిలయము హాస్టలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

# దైవార్పితభావమే సర్వసంగ పరిత్యాగము

**మంచివారి పొందు మహిలోన దొరుకదు**
**దుష్టులెందరైన దొరుకుచుంద్రు**
**కలికిరాళ్లు భువిని కలవుయెన్నైనను**
**విలువ కలుగు వజ్రమె వెతుకవలయు**

విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాభిమానులారా!

దీపమునకు ఒక విశిష్టమైన శక్తి కలదు. ఈ శక్తి ప్రపంచమునందు యేపదార్థమునకు కానరాదు. వెలుతురునందించి, చీకటిని దూరము చేయునదే యీ విశిష్టమైన శక్తి. కనుకనే భారతీయులు ప్రాచీనకాలమునుండి యీ దీపమునకు ఒక విశిష్టమైన ప్రాధాన్యతను అందిస్తూ వచ్చారు. పుణ్యకార్యములకు, ఇక పవిత్రమైన ప్రయత్నమునకు మొట్టమొదట దీపారాధన జరుపుతూవుంటారు. దీపమునకు నమస్కరిస్తూవుంటారు. ఇంతేకాదు, దీపము మానవత్వమునకు దివ్యత్వమును ప్రబోధించే వెలుగుబాటగా నిరూపిస్తూ వుంటారు. నిర్విరామకృషితో, నిరంతర తాపత్రయములతో అంతులేని ఆశలతో, అర్థముకాని ఆవేదనలతో అప్రాప్యరూపమును యీ దివ్యమైన దీపము వెలుతురులో తాను పొందటానికి ప్రయత్నిస్తుంటాడు. ఈ పవిత్రమైన తత్త్వమునకు యిది ఒక్కటియే కాదు, ప్రమాణము. దీనికి మరొక అపూర్వమైన గుణముంటున్నది. ఇది యెక్కడ వెలిగించినప్పటికి ఊర్ధ్వగతికే వెడుతుందిగానీ అధోగతికి పోదు. దీనికే 'ఊర్ధ్వమూలమ్' అన్నారు. ఇదే దైవమార్గమని, బ్రహ్మమార్గమని నిరూపిస్తూవచ్చారు. అధోగతి పాపమార్గమనియు యీ చీకటిని పోగొట్టే సాధనమే దీపమని, బోధిస్తూ వచ్చారు. లోకములో యీ వెలుగు బాహ్యమైన చీకటిని మాత్రమే దూరముగావించునుకాని, అంతర్గతమైన చీకటిని దూరముగావించలేదు. ఎన్నో జన్మలనుండి మానవుని హృదయమునందు కరడు కట్టుకొన్నటువంటి అజ్ఞానమనే చీకటిని

sri sathyasai vachanamrutam

యీ వెలుతురు దూరముగావించలేదు. రాగద్వేషములనే మాలిన్యములతోకూడిన మనస్తత్వమును యిది యేమాత్రము నిర్మూలముగావించలేదు.

## చిత్తశుద్ధిలేని మానవుడు జ్ఞానతత్త్వమును పొందలేడు

కుబేరుని అన్నగా పొందినటువంటివాడు, రావణుడు. మహాబలవంతుడైన కుంభకర్ణుడు తనకు తమ్మునిగా గలవాడు. ఇంద్రుని జయించిన ఇంద్రజిత్తనే కుమారుని కలిగినటువంటివాడు. ఒక తలకాదు పదితలలు ప్రత్యేకంగా వుండినటువంటివాడు. స్వర్గమును మరపించే పట్టణము అతని లంకా పట్టణము. ఇట్టి శక్తిసామర్థ్యములు వుండినప్పటికి, యిన్ని భోగములు తాను అనుభవించుచున్నప్పటికిని, తన మనసునందున్న అంధకారమును నిర్మూలించుకోలేకపోయాడు. ఎన్ని సౌఖ్యములు, ఎన్ని విద్యలు, ఎన్ని పదవులు, ఎన్ని విధములైన అధికారములుండినప్పటికినీ చిత్తశుద్ధియే లేకుండిన మానవుడు జ్ఞానతత్త్వాన్ని పొందలేడు. హనుమంతుడు లంకనంతయు కాల్చివేసినప్పుడు అర్ధరాత్రి యీ అగ్నిజ్వాలలు లంకాపట్టణమునందంతటను వ్యాపించి పట్టపగలుగా కన్పించుచున్నప్పటికిని రావణునియొక్క హృదయములో చీకటిగానే వుంటున్నది. కారణంయేమిటి? దుష్టచర్యలు, దుష్టగుణములు, దుష్టభావములు హృదయమునందు దాగివుండటంచేతనే తనయందు యేమాత్రంకూడను ప్రకాశం కన్పించటంలేదు. కనుకనే, ప్రతి మానవునియొక్క తత్వము పవిత్రమైనదిగను, నిర్మలమైనదిగను, నిస్వార్థమైనదిగను, పరిశుద్ధమైనదిగను నిరూపించుకోవాలి.

## జ్ఞానముయొక్క అభావమే అజ్ఞానము!

బాహ్యమైన జ్యోతికి నాల్గుపదార్థములు అత్యవసరము. ఒకటి ప్రమిద. రెండవది నూనె. మూడవది వత్తి. నాల్గవది అగ్గిపెట్టి. ఈ నాల్గింటిలో యే పదార్థము లేకపోయినప్పటికనీ జ్యోతి వెల్గించలేము. అదేవిధముగనే అంతర్జ్యోతిని వెల్గించుటకుకూడను నాల్గుపదార్థములు అత్యవసరము. దీనికి వైరాగ్యమే ప్రమిద. భక్తియే తైలము. చిత్తైకాగ్రతే వత్తి. తత్త్వజ్ఞానమే అగ్గిపెట్టి. ఈ నాల్గింటిలో యే ఒక్క పదార్థము లేకపోయిననూ మనము ఆత్మజ్యోతిని వెలిగించలేము. అశాంతిలోని ప్రశాంతి, ప్రశాంతిలోని ప్రకాంతి, ప్రకాంతిలోని పరంజ్యోతి,

sri sathyasaivachanamrutam

ఆ పరంజ్యోతియే పరమాత్మ స్వరూపము. కనుక, యీ పరమాత్మతత్త్వము యెక్కడున్నది అనగా అశాంతిలోనే వుంటున్నది. అజ్ఞానమునందే వుంటున్నది. ఈ అజ్ఞానము ప్రత్యేకమైన ఒక పదార్థము కానేరదు. జ్ఞానముయొక్క అభావమే! వెలుతురుయొక్క అభావమే చీకటి. రెండింటియందున్న యేకత్వాన్ని గుర్తించి వర్తించుటయే మానవునియొక్క ప్రధాన కర్తవ్యము.

అట్టి తెలివిలేటలు కల్గిన మానవుడుగా వుండినప్పటికి మనము దానిని సరియైన మార్గములో వినియోగించుకోలేకపోతున్నాము. ఎట్టి చదువులు యెరుగని జీవులన్నియు, పశుపక్ష్యాదులుకూడను తమయొక్క నియమమును తాము వుల్లంఘించక జీవిస్తూ వస్తున్నాయి. కాని, తెలివికల్గిన మానవునికి యీ తెలివి లేకపోతున్నది. మానవత్వములో పుట్టి దివ్యత్వాన్ని అనుభవిస్తూ దైవత్వాన్ని విస్మరిస్తూ మనయొక్క మానవత్వాన్ని వ్యర్థం గావించుకుంటున్నాము. 'జంతూనాం నరజన్మ దుర్లభమ్'. బ్రహ్మతత్త్వాన్ని పొందే అర్హత దానికి వున్నది. నిత్యానిత్య పరిశీలనా జ్ఞానము కల్గివుంటున్నది. తనయొక్క గతము, వర్తమానము, భవిష్యత్తుకూడను ఆలోచించగల జ్ఞానిగా వుంటున్నాడు. ఇన్ని విధములైన వుత్తమగుణములు వుండికూడను, మానవుడు తనకంటె హీనమైన పశుపక్ష్యాదులకన్నా అధ్వాన్నంగా ప్రవర్తిస్తున్నాడు. వాటికైనా ఒక గమ్యము, ఒక కారణము, ఒక విధమైన కర్తవ్యము ఉంటున్నాయి. కానీ, యీ మానవునియందు యే విధమైన సీజనుకాని రీజన్‌కాని కనుపించటంలేదు. ఇలాంటి మానవత్వమును మనము యీనాడు తీర్చిదిద్ది ఆదర్శప్రాయమైన జీవతత్త్వాన్ని జగత్తుకు చాటాలి. మనది మానవజాతి. అందరూ దైవముయొక్క బిడ్డలే! అందరూ అన్నదమ్ములతో సమానమే! ఈ విధమైన తత్త్వాన్ని మనము నిరంతరము స్మరిస్తూ వుండాలి.

**వైరాగ్యమనగా మనలోని దుష్టబుద్ధులు దూరము చేసుకోవటమే!**

ఈ జగత్తులో యెటుచూచినా భయమే! ఎటుచూచినా కష్టములే! వీటిని మనము యేనాడూ తొలగించుకోటానికి ప్రయత్నించటంలేదు. అతివృష్టి, అనావృష్టి, యుద్ధములు, కల్లోలములు, కలహములు, కులము, మతము, వర్గము, యింతేకాదు, ప్రాంతీయ

sri sathyasai vacharamrutam

దురభిమానములుకూడను చెలరేగుతూ వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో యేకత్వమనే దివ్యత్వము యేరీతిగా మనము అనుభవించటానికి వీలవుతుంది? మనకు అభయత్వము ప్రాప్తించవలెనంటే వైరాగ్యమే నిజమైన మార్గము. ఈనాడు ప్రపంచములో ఎక్కడచూచినా భయమే! కాని, వైరాగ్యమునందు భయములేదు. అటువంటి వైరాగ్యాన్ని మనము పొందినప్పుడే నిజమైన ఆత్మజ్యోతిని వెల్గించినవారము కాగలము. వైరాగ్యమనగా కేవలము సర్వము త్యజించి, అరణ్యమునకు పోయి కూర్చోటంకాదు.

**భావమందు దుష్టభావము వీడుటే**
**త్యాగమగును అదియె యోగమగును**
**ఆస్తి ఆలి వీడి అడవికేగుటకాదు**

వైరాగ్యమనగా మన హృదయమందు ప్రవేశించిన దుష్టబుద్ధులు మనము దూరము చేసుకోవాలి. ఇలాంటి పవిత్రమైన కర్మలో ప్రతివ్యక్తికూడను ప్రవేశించాలి.

భగవద్గీత మూడు రకములైన మార్గములు బోధిస్తూ వచ్చింది. మత్కర్మ. మత్కర్మ అనగా యేమిటి? నాయొక్క కర్మలాచరించాలని. ఇక్కడ కేవలము వ్యక్తిగతమైన కర్మలుకావు. కృష్ణుడు కేవలము నాకర్మలే నీవు ఆచరించమని బోధించాడు. నేను అనేది విశ్వస్వరూపము. సర్వత్రానిండిన తత్వములోపల 'ఏకోహం బహుస్యాం'. కనుక, మనము దేశమునకు సేవ చేయాలి. సొసైటిలో మనము కర్మలాచరించాలి. వ్యక్తిత్వము, సమాజము, విశ్వము యీ మూడుకూడను త్రిమూర్త్యాత్మకస్వరూపము. అందులో యేఒక్క తత్వమును మనము విస్మరించినప్పటికిని అన్నింటియందు మనము అపజయమునే పొందగలము. వ్యక్తిత్వముయొక్క పవిత్రతే సమాజములో రూపొందింపజేస్తుంది. సమాజముమొక్క మంచితనమే దేశములో వ్యాపిస్తుంది. కనుకనే వ్యక్తిత్వములోపల పవిత్రతను పెంచుకోటానికి తగిన కృషి సల్పాలి.

**మన కర్తవ్యమును మనం సరిగా నిర్వర్తించినప్పుడు మన స్థితి క్షేమంగానే వుంటుంది**

పవిత్రమైన ఈ వైరాగ్యమునందు కొన్ని విధములైన నియమములు పాటించాలి. 'నశ్రేయో నియమం వినా'. ఎలాంటి పరిస్థితులయందైనా నియమమును



sri sathyasai vachanamrutam

అనుసరిస్తూరావాలి. మితిమీరిన పనికాని, మితిమీరిన భావముకాని, మితిమీరిన ఆశలుగానీ మానవునియందు వుండరాదు. మనము గాలిని పీల్చుకుంటున్నాము. ఎంతగాలిని పీల్చుకుంటున్నామో అంతగాలిని తిరిగి మనము వదలుతున్నాము. ఇదే వైరాగ్యము. తీసుకున్న గాలిని విడువకుండిన మన ఊపిరితిత్తులు కొంతవరకు దెబ్బతింటాయి. మనము తీసుకున్న ఆహారాన్ని తిరిగి మనము విసర్జిస్తున్నాము. అదే విధముగనే సమాజమునుండి మనము సేకరించుకున్న శక్తిసామర్థ్యములను తిరిగి సమాజముకొరకు మనము వుపయోగపెట్టాలి. మనము ఆర్జించిన ధనముగానీ, బలముగానీ, గుణముగానీ దీనిని సమాజములో వుపయోగపెట్టి పదిమందికి సద్వినియోగము చేయటానికి కృషి చెయ్యాలి. ఇదే నిజమైన త్యాగము. ధనమివ్వనక్కరలేదు. అరణ్యమునకు పోనక్కరలేదు. సర్వము త్యాగము చేయనక్కరలేదు. ఇచ్చినటువంటివి రెండు చేతులు. ఉన్నది ఒక్క కడుపు. ఒక్క కడుపునింపుకోటానికి రెండు చేతులు చాలవా? రెండు చేతులనిండుకు మనము పనిచేస్తే ఒక్క కడుపునిండదా? ఈనాడు మనము కడుపునింపుకోలేకపోతున్నామంటే రెండు చేతులనిండుకు సరైన కర్మలు ఆచరించటములేదు. మన కర్తవ్యములు మనము సరిగా నిర్వర్తించినప్పుడు మనము క్షేమముగానే వుంటాము. ప్రతి మానవుడుకూడను తనయొక్క ఆత్మజ్యోతిని, అంతర్జ్యోతిని వెలిగించుకొనుటకై ప్రయత్నించాలి.

**ఇంద్రియములు మీ స్వాధీనములో వుండాలికాని, ఇంద్రియములకు మీరు స్వాధీనము కాకూడదు**

ఇది యెక్కడ మనము వెలిగించాలి? ఎక్కడ చీకటియో అక్కడే వెలిగించాలి. మనకు చీకటి యెక్కడ కనిపిస్తున్నది? క్షణక్షణముకూడను మనము సందేహములతో నిండి వుంటున్నాము. జగత్తునందు సందేహము. కుటుంబములో సందేహము. ఏ పని ప్రారంభించినా సందేహము. ఇది క్రమక్రమేణా దైవమువరకు ప్రాకుతూ వచ్చింది. ఈ సందేహము వుండినంతవరకు మనము స్వాతంత్ర్యము అనేది లభించదు. విద్యార్థులారా! మీరు ప్రధానమైన శక్తిసామర్థ్యములు సాధించాలి. మీరు masters గానీ slaves కాదు.

sri sathyasai vahanamrutam

మీరు యింద్రియములను slavesగా వుపయోగించుకోవాలి. ఈ యింద్రియములంతా మీ స్వాధీనములో వుండాలికాని, యింద్రియములకు మీరు స్వాధీనము కారాదు. ఇంద్రియముల స్వాధీనమే అయినప్పుడు మీరు slaves అవుతారు. మీరు mastersగా తయారుకావాలి. ఈ విధమైన తత్త్వాన్ని పొందాలనుకున్నప్పుడు మొట్టమొదట మీయందున్న అజ్ఞానమనే చీకటిని దూరము చేసుకోవాలి. ఒకానొక సమయములో ఒక గోపిక ఆశించింది. "కృష్ణా! నీవు చేసే చిలిపి చేష్టలను గురించి గోపికలందరు యశోదమ్మ దగ్గర రిపోర్టు చేస్తున్నారు. యశోద నిన్ను పట్టి శిక్షించటానికి అనేక విధములుగా ప్రయత్నములు చేస్తోంది. ఎక్కడో దాగుకుంటానికి నీవుకూడను పారిపోతుంటావు. నీవు నల్లటివాడవు. నీవు చీకటి స్థానమునందు చేరినప్పుడు నీరూపము యశోదకు కన్పించదు. కానీ, యశోద యిల్లు యెక్కడ చూచినను తెల్లగనే వుంటున్నది. కనుకనే నిన్ను అతి త్వరగా కనిపెట్టి పట్టి శక్షిస్తున్నది. నీకు ప్రత్యేకమైన స్థానము చూపిస్తాను, అందులో నీవు దాగుకో!" అనింది. ఏది ఆ ప్రత్యేకమైనటువంటి స్థానము? "నా హృదయము అజ్ఞానమనే అంధకారములో నిండియున్నది. అది చీకటిగా వుండేటువంటిది. నీవు అందులో ప్రవేశిస్తే ఆ చీకటి దూరమవుతుంది, నీకు శిక్ష తప్పుతుంది. నాలో ప్రకాశము హెచ్చుతుంది. నీవు యెక్కడ వుందువో అక్కడే ప్రకాశము. నీవున్న చోట చీకటి వుండటానికి వీలులేదు. నా హృదయములో నీవు లేవు కనుకనే చీకటి ఆవరించి వుంటుండాది. కనుక, కృష్ణా! నా హృదయములో ప్రతిష్ఠకమ్ము"ని కోరింది.

## మనసులోని మాలిన్యమును దూరము చేసుకునే సాధనయే భక్తి మార్గము

ప్రతి మానవునియందు భగవంతుడు హృదయస్థాయిగా ఉంటున్నాడు. హృదయస్థాయి అనగా ప్రేమయందే ప్రతిష్ఠ అయివుంటాడు, భగవంతుడు. మనము యెన్ని విధములైన సమాజసేవలు చేసినప్పటికిని, ఎన్ని పదవులు యేలినప్పటికిని ఎలాంటి వుత్తమమైన స్థానములు పొందినప్పటికిని, మనసుయందు మాలిన్యమువుండిన మనము దేనినికూడను అనుభవించలేము. ఆనందాన్ని పొందలేము. కనుక, మనసుయొక్క మాలిన్యాన్ని దూరము చేసుకోవాలి. ఇలాంటి దూరము చేసుకునే సాధనలే భక్తి మార్గములు. ఇలాంటి భక్తి

sri sathyasai vahanamrutam

మార్గమునందు కొన్ని విధములైన నియమములు మనము పూనాలి. భక్తి అనగా యేమిటి? కేవలము జపము చేయటమా, భజన చేయటమా, ధ్యానము చేయటమా లేక పూజలు చేయటమా? ఈ భజనలయందుకూడను మన మనసు నిలవటంలేదు. కారణం యేమిటి? మన మనస్సు రాగమునందు, తాళమునందు, పాటయందుమాత్రమే లగ్నమవుతున్నది. దైవము వైపున యిది మరలటంలేదు. మనసును దైవము వైపు మరల్చి యీ రాగతాళములు త్యజించినామంటే యీ భావము చాలా మధురముగా వుంటుంది. కానీ మన యేకాగ్రత అంతయు తాళముపైన, రాగముపైన, పాటపైన పోతుండాది. ఇది భక్తి కానేరదు.

### పరమాత్ముడు వేదస్వరూపుడు

ప్రేమతత్త్వముతో పవిత్రమైన భావముతో, నిస్వార్థమైన తలంపుతో దైవమును చింతించటమే సరియైనటువంటి భక్తి. ఏది చేసినా, యేది చూచినా, యేది చెప్పినా అంతా దైవభావముతోనే వుండాలి. కారణమేమనగా సర్వత్రా దైవమే, సర్వమూ దైవమే! అలాంటి యేకాత్మభావమును మనము అభివృద్ధిపరచుకోవాలి. ఈనాడు మనం యే సాధన చేస్తున్నప్పటికి దైవముకోసము చేస్తున్నామని భావిస్తున్నాము. అది చాలా పొరపాటు. దైవముకోసము మనము యేమీ చేయనక్కరలేదు. నీ మనసు మరలిస్తే చాలు. నీవు చేసే సర్వసాధనలు నీ నిమిత్తమే చేసుకుంటున్నావుగానీ దైవముకోసముకాదు. ఈ సత్యాన్ని మనము గుర్తించాలి. భజన చేస్తున్నాము. నీకు నీవు ఆనందిస్తున్నావు. నీ భజనచేత దైవము ఆనందించటములేదు. కనుక యేయొక్క పూజలు చేసినప్పటికిని నీ నిమిత్తమే నీవు చేసుకుంటున్నావు. ఏదీ చేయనక్కరలేదు. కారణమేమిటి? నీకంటే దైవము ప్రత్యేకముగా వుండినప్పుడు అది నీవు చేసేటువంటిది. నీవు యిచ్చేటువంటిది, తాను అందుకొనేటువంటిది. దీనినే భగవద్గీతయందు కృష్ణుడు 'వేదము, వేదాంతము, వేదజ్ఞుడు నేనేను', అన్నాడు. వాక్కుతో చేసేటువంటిదంతా సామవేదము. ఋగ్వేద, యజుర్వేద, సామవేదములయొక్క తత్త్వమే వాక్కు, మనసు, ప్రాణము. సర్వమును వేదమయమే. వేదస్వరూపుడు పరమాత్ముడు. పరమాత్మునివలెనే వేదము అనంతమైనది. 'అనంతోవైవేదః', అన్నారు. మనయందున్నటువంటి వాక్తేజస్సును మనము అభివృద్ధిపరచుకోవాలి.

srisathyasaivachanamrutam

జీవితము నిమిత్తమై మనము బ్రతకటానికి ప్రయత్నించాలి. మన ఆదర్శములను అందించే నిమిత్తమై మనము బ్రతకవలసిందేకానీ, ఆశలకోసము బ్రతుకరాదు. Eat to live, live not for eating. మన జీవితము తినటానికి వచ్చినట్టుగా వుండకూడదు. జీవించటానికి తినాలి మనము. ఈ సత్యాన్ని మనము చక్కగా గుర్తించాలి. మన జీవితము ఆదర్శవంతమైన జీవితముగా రూపొందాలి. ఆదర్శమునకు అనేక కష్టములు సంభవిస్తాయి. వాటినన్నింటిని యెదుర్కొని మనము ఆదర్శాన్ని అందిస్తూరావాలి. ఆదర్శజీవితమే నిజమైన జీవితము. ఆశలతో జీవించే జీవితము జీవితమే కాదు. మనము అనేక విధములైనటువంటి త్యాగములు చేసినట్టుగా భావిస్తున్నాము. నిజముగా యే మానవుడుకూడను సర్వసంగపరిత్యాగిగా యీ జగత్తులో కానరావటంలేదు. ఇది కేవలము తమ తృప్తి నిమిత్తము తాము చెప్పుకోటమే! ఒక్క దైవార్పితమైన భావమే సర్వసంగపరిత్యాగము. ఎక్కడవుంది దైవార్పితము? నిజంగా దైవార్పితమే వుంటుంటే జగత్తు యీ విధమైన దుఃఖములతో, అశాంతితో వుండేటువంటిదికాదు.

**ఏ కాలమందును మార్పు చెందనటువంటిది సత్యము**

సత్యమార్గాన్ని మనము అవలంబించాలి. సత్యమంటే యేమిటి? చూచినది చూచినట్టు, తలచినది తలచినట్టు చెప్పటము సత్యమనుకుంటున్నాము. ఇది సత్యము కాదు. ఏ కాలమందుకూడను మార్పు చెందనటువంటిది, సత్యము. ఈ సత్యవ్రతముకూడను చాలా నియమముతో కూడినది. ఈ సత్యముతో అనేక విధములైన దుఃఖములుకూడను సంప్రాప్తమౌతాయి. లౌకికమైన సత్యము జీవితానికి ప్రమాదము. కానీ యీ సత్యము ప్రమాదమని విసర్జించరాదు. సమయసందర్భములను పురస్కరించుకొని యీ సత్యమును ప్రవేశపెట్టాలి. 'సత్యంబ్రూయాత్ ప్రియంబ్రూయాత్ నబ్రూయాత్ సత్యమప్రియమ్', అన్నారు. సత్యము ప్రియముగా వుంటుండాలి. సత్యము హితముగా వుంటుండాలి. సత్యము చాలా యింపుగా వుంటుండాలి. ఉద్రేకముగా వుండకూడదు. అప్రియమైనటువంటి సత్యాన్నికూడను చెప్పకూడదు. ఒకరికి ప్రియమవుతుందని అసత్యమును ఆడకూడదు. దీనికి అనేక విధములైన పద్ధతులుంటున్నాయి. కొన్ని

sri sathyasaivachanamrutam

విధములైన నియమములుకూడా వుంటున్నాయి. కనుక, యిలాంటి నియమములను మనము పాటిస్తూ సత్యాన్ని దృష్టియందుంచుకొని, సత్యము దైవముగా భావించి మన కర్తవ్యము నిర్వర్తించాలి.

**విద్య జీవితము నిమిత్తమేకాని, జీవించే నిమిత్తముకాదు**

విద్యార్థులారా! యీనాడు మనము యేదో ఉద్యోగాల నిమిత్తమై చదువులు చదువుకోటానికి ప్రయత్నిస్తున్నాము. ఇది దురదృష్టము. ఫలానా కోర్సులో ప్రవేశించటానికి పూర్వమే మనలో ఆశలు ప్రారంభమవుతున్నాయి. 'ఈ subject తీసుకుంటే భవిష్యత్తులో యే ఉద్యోగములు చేయవచ్చును? ఏ డిగ్రీ తీసుకుంటే యే విధమైన పదవి పొందవచ్చు', ఇలాంటి plan తోనే మనము విద్యలో ప్రవేశిస్తున్నాము. ఈ విద్య అనేది జీవితము నిమిత్తమేగాని, జీవించే నిమిత్తము కాదనే సత్యాన్ని మీరు గుర్తించాలి. కనుక, ఉద్యోగమునకు, విద్యకు వుండిన సంబంధమును మొట్టమొదట మనము త్రెంచివెయ్యాలి. ఈనాడు విద్యావిధానమనేది చైతన్యముకాని, నైపుణ్యముకాని లేని రీతిగా జరుగుతూ వస్తుండాది. మన విద్యావిధానమునందు నైపుణ్యము వుంటుండాలి. మన విద్యావిధానములో చైతన్యము రావాలి. సమాజములో పవిత్రమైన వాతావరణము అభివృద్ధి కావాలి. అవినీతి, అజ్ఞానము, అశాంతి అనే వాటిని మనము దూరము గావించాలి. నీవు కర్మయోగిగా రూపొందాలి. నీ ప్రతియొక్క శక్తినికూడను సమాజమునకు అర్పితము గావించాలి. కేవలము శారీరక, మానసికశక్తులు మాత్రమేకాక, మన విద్యాశక్తినికూడను సమాజములో ప్రవేశపెట్టి తద్వారా మన హృదయమును విశాలమైన హృదయముగా రూపొందింప చేయాలి.

**గోపికలు ఎల్లప్పుడు కృష్ణార్పిత భావముతో జీవించారు**

విద్యార్థులారా! ధన నిమిత్తమై మనము పాటుపడకూడదు. గుణ నిమిత్తమై మనము పాటుపడాలి. గుణమున్నచోట ధనముంది. భోగములో రోగముంది. త్యాగములో యోగముంది. త్యాగముతో జీవితాన్ని ప్రారంభించాలి. ఇలాంటి పవిత్రమైన సూక్తులను మనము హృదయమునందు ప్రతిష్ఠింపచేసుకున్నప్పుడే మన జీవితము ఆదర్శవంతమైన



sri sathyasai vachanamrutam

జీవితముగా రూపొందుతుంది. మనయొక్క ఆత్మజ్యోతిని నిరంతరము ఉన్నతస్థాయికి, పవిత్రమైన ఊర్ధ్వగతికి మనము ప్రయాణము చేయించాలి. ఈ విధమైన మార్గములో మనము ప్రవేశపెట్టినప్పుడే మనయొక్క ఆత్మజ్యోతి పరంజ్యోతిగా మారుతుంది. మన హృదయములో ఆత్మజ్యోతిని వెలిగించాలి. ఒకానొక సమయములోపల కృష్ణ వియోగ దుఃఖములో పరితపిస్తున్నటువంటి గోపికలదగ్గరకు ఉద్ధవుడు వచ్చాడు. సమయమునందు గోపికలకు ఉద్ధవుడు యే వార్త వినిపించటానికి వీలవుతుంది? అప్పుడు గోపికలు "ఉద్ధవా! నీవు తెచ్చినటువంటి వార్తవల్ల మాకేమాత్రము తృప్తిలేదు. మొట్టమొదట కృష్ణుని తీసుకురా లేక కృష్ణునికి మా సందేశాన్నైనా అందించు.

**చెదిరిపోయిన నాదు జీవితసుమమాల**
**చెల్వారకూర్చి ధరియించమనవె**
**మబ్బుగ్రమ్మిన నాదు మానసవీధిలో**
**కృష్ణభానుని తేజము నిలుపమనుము**
**ఎండబారిన నాదు జీవిత వృక్షమునకు**
**చిగురుపెట్టగ వేగ చేరమనవె**

నా హృదయమనే వీధిలోపల చీకటి క్రమ్ముకుంది. అజ్ఞానమనే చీకటి ప్రవేశించింది. ఈ అజ్ఞానము పరిహారము కావాలంటే కృష్ణుని తనయొక్క నామజ్యోతిని మాయందు వెలిగించమని చెప్పు. మా జీవితమనే వృక్షము యెండబారి మొద్దుబారి పోయింది. చల్లని ఛాయలేదు. కనుక త్వరలో దానికి చిగురు పట్టేట్టు చేయమను. మా జీవిత సుమమాల అనేక విధములుగా అల్లకల్లోలమైపోయింది. మాయొక్క భావములనే పుష్పములు చెదరిపోయినాయి. తానే వచ్చి యీ పుష్పములు యే విధంగా అలంకారముతో కూర్చాలో వచ్చి కూర్చుకొమ్మను" అని ఉద్ధవునిద్వారా కృష్ణునికి సందేశమును పంపించారు. గోపికల భావము యింతటి పవిత్రమైనది. గోపికలు స్వార్థమును యేమాత్రము ఆశిండెడివారుకాదు. ఏమిచేసినప్పటికినీ అన్నీ 'కృష్ణార్పితమ్'. కృష్ణభావములోనే వారు జీవితము అంకితము గావించుకొన్నారు. గోపికలు, కృష్ణుడు అవినాభావ స్వరూపులు. అలాంటి యేకత్వాన్ని

sri sathyasai vachanamrutam

పొందినవారు కనుకనే తమయొక్క జీవితాన్నికూడను లెక్కచేయక భగవంతునితో చేరిపోయారు. ఏ అర్ధరాత్రిలోపలనో వేణుగానము వినిపించిందంటే యిది రాత్రా పగలా, యెవరున్నారు నాచుట్టూ అనే విచారణలేకుండా యిల్లు వదలి పరుగెత్తి పోయేటువంటివారు. అలాంటి ఆర్తులై ప్రార్థిస్తూ వచ్చారు, గోపికలు. "కృష్ణా! మేము నీవారముకానీ, నీవు మావాడవుకావు" అని భావించారు. మేము మీ వారమునేటువంటి భావనలో surrender, అనగా శరణాగతి భావము ఉన్నది. యాదవులందరుకూడను 'కృష్ణా! నీవు మావాడవు, నీవు మావాడవ'ని భావనతో మునిగిపోయారు. అలా చెప్పుతే అహంకారము పెరుగుతుంది. అహంకారమే అధఃపతనము చేస్తుంది. కనుకనే యీ యాదవ కులములో అహంకారమనే ముసలము పుట్టి యాదవులను నాశనము చేసింది. గోపికలలోపల ప్రేమతత్త్వము పెరిగిపోవటంచేత గోపికలు, కృష్ణుడు ఒకటైపోయారు. ఇలాంటి తత్త్వమును బోధించేటువంటిదే యీ గోపికల, ఉద్ధవసంవాదము. దీనినే భ్రమరగీతయనికూడ చెప్పారు. 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి'. ఏది మనము చింతిస్తూ వుంటామో దాని స్వరూపాన్ని మనము పొందుతాము.

కనుక, ఆత్మజ్యోతిని వెలిగించుకోటానికి చిహ్నముగా యీనాడు ఒక జ్యోతిని వెలిగించాము. జ్యోతియొక్క విషయాన్ని చక్కగా అర్థము చేసుకోటంలేదు మీరు. ఈనాడు మీ హృదయజ్యోతిని మీరు వెల్గించుకున్నట్టుగా భావించాలి. మీలో వుండిన దుష్టభావములు, దుష్టచర్యలు, రాగద్వేషాలు యీనాటినుండి కొంతవరకు దూరము గావించుకోటానికి ప్రయత్నించాలి. అవి మీ హృదయములో వుండినంతవరకుకూడను మీరు మానవులే కాదు. కేవలము ఆకారము మానవాకారమేకాని దానవతత్త్వము. కనుక, యిలాంటి దానవత్వాన్ని, పశుత్వాన్ని మనము దూరము గావించుకోటానికి ప్రయత్నించి మానవత్వంగా రూపొందాలి.

మన విద్యాసంస్థ కేవలము ఒక విద్యను మాత్రమే అభ్యసించటానికికాదు. ఆధ్యాత్మికవిద్యకూడను విద్యలో భాగంగా వుంటుండాలి. అందువలననే గీతయందు 'అధ్యాత్మ విద్యావిద్యానాం' అన్నారు. మనము చదివినటువంటి సర్వవిద్యలుకూడను

srisathyasaivahanamrutam

నదులవంటివి. కానీ, ఆధ్యాత్మిక విద్య సముద్రమువంటిది. 'నదీనాం సాగరో గతిః'. ఈ సర్వనదులుకూడను సముద్రములో చేరిపోతాయి. కనుక మనము చదివే సర్వవిద్యలను ఆధ్యాత్మికవిద్యలో అంకితము గావించాలి.

**మాటలు ఎంత అదుపులో పెట్టుకుంటామో అంత శక్తిసామర్థ్యములు సాధించినవారమవుతాము**

విద్యార్థులారా! మొట్టమొదట మనము వాక్‌తత్వాన్ని అదుపులో పెట్టుకోవాలి. అధికముగా మాట్లాడటం మంచిదికాదు. ఈ అధికమాటలచేత యేమైపోతుండాది? మన మెమరీ పవర్ తగ్గిపోతున్నది. ఎనర్జీ waste అవుతుంది. ఇంతేకాకుండా, కొన్ని విధములైన బలహీనతలు యేర్పడుతున్నాయి. అతి త్వరలో వృద్ధాప్యము ప్రాప్తిస్తుంది. కనుక, మాటలు యెంత అదుపులో పెట్టుకుంటారో అంత శక్తిసామర్థ్యములు మనము సాధించినవారమవుతాము. ఒక రేడియో వుంటున్నాది. ఆ రేడియో ఒక గంటసేపు మనము వేసుకొని దాని news అంతా మనము వినేటప్పటికి యీ గంటలోపల యెన్ని యూనిట్ల కరెంటు waste అయిపోయివుంటుంది. అదే విధముగనే మన దేహము ఒక రేడియో. మన మాటలు ఒక news. ఈ news లోనే అనేక న్యూసెన్సు అంతా వస్తుంటాయి. మనలోపల వున్నటువంటి ఎనర్జీ అంతను waste అయిపోతుంది. మన మాటలలో, మన చూపులలో, మన తలపులలో, మన శ్రవణములో అన్ని యింద్రియములద్వారా మన ఎనర్జీ waste అవుతున్నాది. కనుక, మానవుడు పెరుగుతూ పెరుగుతూకూడను బలవంతుడు కావటంలేదు. బలహీనుడవుతున్నాడు. కారణం యేమిటి? దేహము పెరుగుతున్నది కానీ ఆయుఃప్రమాణము తరుగుతున్నాది. కనుకనే మన పూర్వీకులంతా మౌనము అనే వ్రతమును పాటించేటువంటివారు. తద్వారా వారియొక్క జ్ఞాపకశక్తిని, మేధాశక్తిని పెంచుకొనేటువంటివారు. ఆ మేధాశక్తిద్వారా నిత్యానిత్య విషయపరిశీలనాశక్తిని పెంచుకొనేవారు. ఈనాటి పిల్లలకు రాత్రి చదివిన పుస్తకములో వున్న విషయము తెల్లవారేటప్పటికి జ్ఞాపకం ఉండదు. కారణం, మనయొక్క energyని యీ మాటలచేతను, శ్రవణముచేతను మనము దుర్వినియోగము చేస్తున్నాము. తద్వారా మనము దైవత్వాన్ని

sri sathyasai vahini amrutam

చేరలేకపోతున్నాము. మన చూపులుగానీ, మన వినికిడిగాని, మన మాటలుగాని, మన చేతలుగాని సరియైన పనులలోపల, సరియైన విషయములోపల ప్రవేశపెట్టాలి. దానినే నేను అప్పుడప్పుడు చెబుతూవుంటాను, See no evil. Hear no evil. Talk no evil. Do no evil. Think no evil. See what is good. Hear what is good. Talk what is good. Do what is good. Think what is good. This is the way to GOD, అని. ఈ రీతిగా మనము చేసినప్పుడే యీ మార్గము royal roadగా మనకు రూపొందుతుంది. అయితే, యీనాడు మనము narrow roadలో ప్రయాణమైపోతున్నాము. ఈనాటి మానవుడు shortcutను ముందు చూచుకుంటాడు. ఈ shortcutలో చాలా ప్రమాదాలు వుంటాయి. అనేక విధములైన బాధలకు గురికావలసివస్తుంది. కొంచెము దూరమైనా మంచిదే royal road చాలా సౌకర్యంగా వుంటుంది. కొన్ని కొన్ని విషయములందు యీ ఆధ్యాత్మిక మార్గములోకూడను narrow roadగా వుంటుందాదట! యమమార్గము నరకానికి చాలా విశాలమైన రోడ్డుట! స్వర్గానికి పోయే రోడ్డు చాలా చిన్నదట! దీనియొక్క అంతరార్థమేమిటి? స్వర్గానికి పోయేవారు ఒకరో యిద్దరో కాబట్టి యేదో చిన్న రోడ్డులో నడచుకొని పోతుంటారు. నరకానికి పోయేటువంటివారు లక్షలు లక్షలు. ఇంతమంది నడచటానికి వెడల్పుగా వుండాలి కదా, రోడ్డు!

**విద్యాభ్యాసము స్థిరమైన మనసును అభివృద్ధిపరచుకొనుటకు**

కనుక ఉత్తమమైనటువంటి thoughts మనము పెంచుకోవాలి. కానీ యీనాడు low thoughts and higher study. దీనివలన ప్రయోజనమేమిటి? మనము చేయవలసినదంతాకూడను higher thoughts general study. యీ విధమైన మార్గములో వుంటే అదే మనకు steadyగా మారుతుంది. study for steady. స్థిరమైన మనసును మనము అభివృద్ధి పరచుకోవాలి. కానీ యీనాడు study యెట్లా వుందంటే ఎప్పుడుకూడను bumps, jumps. మనము చదివిన దానినే రాయటానికి భయపడిపోతున్నాము. వ్రాసినటువంటి దానినే సందేహిస్తూ వస్తున్నాము. అనగా తనయందు తనకే విశ్వాసము లేకపోతున్నాది. మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనం' అన్నారు. The proper study of mankind is man. Thoughts, words,

sri sathyasai vachanamrutam

actions ఒక్కటి కావాలి. దీనినే వేదాంత పరిభాషయందు త్రికరణశుద్ధి అన్నారు. త్రికరణశుద్ధి గావించుకున్నప్పుడే చిత్తశుద్ధి యేర్పడుతుంది. చిత్తశుద్ధి కలిగినప్పుడే జ్ఞానశుద్ధి లభిస్తుంది. జ్ఞానమనగా కేవలము గ్రంథజ్ఞానముకాదు; ఆత్మజ్ఞానము, బ్రహ్మజ్ఞానము. అలాంటి జ్ఞానము తరిగేటువంటిదికాదు. ఏ పదార్థమైనకూడను ఖర్చుకావచ్చుగాని జ్ఞానము ఖర్చుకాదు. పదిమందికి అన్నము పెడితే యీ రాశి కరిగిపోవచ్చు. పదిమందికి మనము ధనము యిస్తే మన బ్యాంకులో ధనము తరిగిపోవచ్చును. అయితే, జ్ఞానము యిచ్చేకొలది పెరుగుతుందే కానీ, తరగదు. కనుక, పెరిగి తరగనటువంటి జ్ఞానాన్ని మనము అభివృద్ధి గావించుకోవాలి. డిగ్రీల నిమిత్తమై మనము ప్రాకులాడరాదు. ఏ విధముగా వుంటుండాలి విద్య? నల్లటి మేఘములమధ్యలో మెరుపువలె రావాలి.

**మేఘములు మింటిపై చేరి మెదలుచుండ**
**వాటి దాపున విద్యుత్తు వరలునట్లు**
**విద్య వెనుకను జ్ఞానంబు వెలయవలయు**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు?**

ఈ జ్ఞానము విద్య వెనుక ఒక విధమైన విద్యుత్‌శక్తివలె వుంటున్నది. దానినే 'నీలతోయదమధ్యస్థా విద్యులేఖేవ భాస్వరా' అన్నారు. మనలో సుషుమ్నానాడి అని ఒకటున్నది. ఈ సుషుమ్నానాడి మన spinal column లోపల 33వ రింగు వద్ద వుంటున్నాది. ఈనాడు మనకు జ్ఞాపకశక్తి తరిగిపోటానికి కారణంయేమిటి? మనము కూర్చుంటున్నాము. కూర్చుంటున్నప్పుడు యేవిధముగా కూర్చుంటున్నాము? ఒక తొంభై యేండ్ల ముసలివానివలె కూర్చుంటున్నాము. కూర్చుంటే యిట్లా కాదు. చక్కగా కూర్చోవాలి. తలపైన గూటం కొట్టినట్లైతే చక్కగా క్రిందకు దిగాలి. ఒక కఱ్ఱకు తాడు చుట్టినట్టుగా వుంటున్నాది, మన దేహము. కనుకనే మనము కూర్చునే విధానములోపల సుషుమ్నానాడి చాలా దెబ్బతింటున్నాది. ఈ సుషుమ్నానాడి దెబ్బతినటంవలననే జ్ఞాపకశక్తి పోతున్నాది. ఈ జ్ఞాపకశక్తి పోవటానికి కారణము నిత్యజీవితములో మనయొక్క అలవాట్లు, పద్ధతులే!



sri sathyasaivachanamrutam

**విద్యార్థులకు క్రమశిక్షణ చాలా అవసరము**

దీనికే ఒక విధమైన discipline అవసరమన్నారు. ఈ discipline లోపల చాలా strictగా వుంటుండాలి. లేకపోతే జీవితములో మనము చేసే ప్రతిపనియందుకూడను దోషములు యేర్పడుతూ వుంటాయి. పిల్లలైనవారు చాలా చక్కగా కూర్చోవాలి. అప్పుడే మనము చదివిన చదువుకు తగిన ఫలితాన్ని మనము సాధించవచ్చు. మాటలు తగ్గించుకోవాలి. అనవసరమైన విషయాలలో జోక్యము చేసుకోరాదు. ఒక రూమ్‌నుంచి మరొక రూమ్‌కు cats మాదిరి సంచారము చేయరాదు. మనము ఒక మానవునివలె జీవించాలి. తన పనిని తాను చూచుకోవాలి. తెల్లవారి లేచినది మొదలుకొని నేను యెందుకోసము యీ ప్రశాంతినిలయము వచ్చాను, యెందుకోసం యీ college లో చేరాను, ఆ చేరినటువంటి లక్ష్యాన్ని నేను సాధిస్తున్నానా, వచ్చిన పని చేస్తున్నానా అనవసరమైన దాంట్లో నేను ప్రవేశిస్తున్నానా అని తనకు తానే పరిశీలించుకోవాలి, పరీక్షించుకోవాలి. వచ్చేది ఒక పని నిమిత్తము చేసేది మరొకపని. కనుకనే మనము ఆశించినటువంటి ఫలితమును అందుకోలేకపోతున్నాము. మనం చదువు నిమిత్తమై ఇక్కడకు వచ్చాము. చక్కగా, శ్రద్ధగా చదవండి. ఈ చదువు వల్ల తల్లితండ్రులకు తృప్తి, మన Instituteకు మంచి కీర్తి. మీయొక్క భవిష్యత్తుకు చాలా ఉత్తమమైన ఆదర్శముగా వుంటుంది. దానితోబాటు యిలాంటి ఆధ్యాత్మిక భావాలు చేర్చుకొన్నప్పుడు మీ జీవితము దివ్యజ్యోతిగా వెలుగుతుంది.

**తల్లిదండ్రుల ఆజ్ఞను శిరసావహించాలి**

విద్యార్థులారా! మొట్టమొదట మన తల్లితండ్రులకు మనం కృతజ్ఞతను చూపించాలి. తల్లితండ్రులను అలక్ష్యము చేయరాదు. కారణమేమనగా నీ blood, నీ food, నీ head నీ parents gift. కనుక, నీవు దీనిని సార్థకము గావించుకోటానికి ప్రయత్నించాలి. వారియందు కృతజ్ఞతా భావముతో నీవు వారి ఆజ్ఞను శిరసావహించాలి. అందువల్లనే వేదములో "మాతృదేవోభవ, పితృదేవోభవ" అని మొట్టమొదట తల్లిని, తండ్రిని ప్రధానముగా తీసుకున్నారు. తల్లితండ్రులు పంపించే ధనమును మనము దుర్వినియోగము చేయరాదు. మన బ్లడ్, దుడ్డు సవ్యమైన రీతిలో circulation కావాలి. ఈ blood సరిగా

circulation కాకపోతే అక్కడ ఒక boil యేర్పడుతుంది. అదే విధంగా ధనాన్ని దుర్వినియోగము చేస్తే అక్కడకూడను అశాంతి యేర్పడుతుంది. కనుక misuse of money is evil అన్నారు. మనము ధనమును యేవిధముగాకూడను దుర్వినియోగము చేయరాదు. తల్లితండ్రులు యెన్నియో కష్టములకు, నష్టములకు, దుఃఖములకు గురియై మిమ్మల్ని చదివించటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో మీ అదృష్టవశాత్తు మన Instituteలో ఒక్క నయాపైసా ఫీజులేదు. మీ foodకి తప్ప మీరు యేవిధమైన దీనికి ఖర్చు చేయవలసిన అవసరం లేదు. ఇలాంటి అవకాశము మీకు ప్రాప్తించినప్పుడు దీనిని సద్వినియోగము చేసుకోవాలి. ఇలాంటి సద్వినియోగము గావించుకున్నపుడే మనము కాలమును, కర్మను, కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించినటువంటి వారమౌతాము. కొంతకాలానికి అతీతమైనటువంటి స్థితిని మనము పొందాలి. కాలము మనలను మ్రింగివేస్తున్నాది. కాని కాలాన్ని మనము మింగాలి. అలాంటిశక్తిని మనము సాధించాలి. అప్పుడే మానవత్వము దైవత్వముగా రూపొందుతుంది. జనుడు జనార్దనుడుగా మారిపోతాడు. అదే నిజమైన ఆత్మతత్త్వము. ఇలాంటి సత్యాన్ని గుర్తించి వర్తించటము అత్యవసరమని నేను ఆశిస్తూ నా ప్రసంగమును విరమిస్తున్నాను.

**దేహమునకు నేత్రము ఎంత ప్రధానమో నిత్యజీవితములో క్రమశిక్షణ అంత ప్రధానమైనది**

విద్యార్థులారా! ముఖ్యముగా నిత్యజీవితములో మీరు నేర్చుకోవలసినవి యెన్నియో వున్నవి. Discipline అనేది విద్యలో చాలా ప్రధానమైన స్థానము గల అంశము. దేహమునకు నేత్రము యెంత ప్రధానమో, మన నిత్య జీవితములోపల మన ప్రవర్తనకు discipline అంత ఆధారము. తెలుగులో చెబుతారు 'పశువుకొక దెబ్బ, మనిషికొక మాట' అని. మనిషి మాటతోనే తనయొక్క ప్రవర్తనను మార్చుకోవాలి. దెబ్బలు కొట్టించుకొనేంతవరకు పోరాదు. దెబ్బలు కొట్టించుకోనేది పశువు. అందులో మీరు విద్యార్థులు. మీది చాలా పవిత్రమైన వయసు. ఏ రూమ్‌లో యెవరు యేమి చేస్తున్నారో అనే విషయంలో యింకొకరు మిమ్మల్ని watch చేయనక్కరలేదు. ఒక్కొక్క రూమ్‌లో ఒక్కొక్క monitor వుండనక్కరలేదు. మనము అనేక రకములుగా ప్రవర్తిస్తున్నప్పుడు కదా, monitor

srisathyasai vahinamrutam

వుండాలి. కనుక, యెవ్వరూ చెప్పక పూర్వమే మనకు మనమే, యెవరికి వారే monitor కావాలి. ఒకరిచేత చెప్పించుకోకుండా మన ప్రవర్తనను అభివృద్ధి పరచుకోవాలి. Dining Hallలో గాని, Reading Roomలో గాని, bed roomలో గాని, నీ వసతిగృహములో గాని, bath roomలో గాని, యెక్కడైనా గాని discipline ఒక shadow మాదిరి మన వెంటరావాలి. మన shadow మనము యెక్కడకు వెడితే అక్కడకు వస్తుంది కదా! Discipline అనేది విద్యార్థికి పెద్ద shadow. ప్రధానమైన shadow. ప్రతిదానికి warden చూచుకోనక్కరలేదు. లేక రూమ్‌లో వుండిన monitor చూచుకోనక్కరలేదు. మీకు మీరే monitorగా వుండాలి. ఎవరికి వారే discipline నేర్చుకోటానికి ప్రయత్నించాలి. ఇంతేకాకుండా మనలోపల ఒక ప్రత్యేకమైన విద్య ఒకటుండాది. అదియే commonsense, genreal knowledge. Commonsense అంటే యేమిటి? ఏదో ఒక విషయంలో చురుకుగా వుంటుండి, అన్నిటియందు ఆరితేరినట్టుగా చాలా తెలివితేటలున్నట్టుగా మాట్లాడటం commonsense కాదు. తనలో వుండిన దోషాలు తాను గుర్తించి, నిర్మూలము గావించి అందులో పవిత్రమైన భావములు అభివృద్ధి పరచుకోవాలి. ఒకరిచేత వేలుపెట్టి చూపించుకోకుండా బ్రతకాలి. ప్రతి నిత్యముకూడను తెల్లవారిలేచినది మొదలు రాత్రి పరుండేవరకు "దేవతలారా రండి! రాక్షసులారా పొండి!" అనే భావమును మనము అలవాటు చేసుకోవాలి. రాక్షసులారా మీరు పొండి. ఎవరు మన రాక్షసులు? మన దుష్టగుణములే మన రాక్షసులు. పవిత్రమైన భావములే దేవతలు. సర్వదేవతలను స్వాగతముచేసి, దుష్టగుణములైన రాక్షసులకు send off చెయ్యాలి. అలాంటి సత్ప్రవర్తనను మనము ప్రయత్నపూర్వముగా సాధించాలి. విద్యార్థులు చాలామంది తెలివితేటలు కలిగినవారుగా వుంటారు. చాలా మేధాశక్తికూడా వుంటుంది. కానీ general knowledge వుండదు. ఏ సమయములో యెప్పుడు యెక్కడ యే విధముగా ప్రవర్తించాలో వారికి తెలియదు. కనుక, సమయస్ఫూర్తిగా ప్రవర్తించే యీ knowledgeని మనము పెంచుకోవాలి. పెద్దలయందు వినయమును చూపించాలి. సమాజములో సరియైన ఆదర్శమును నిరూపించాలి. అధిక భాషలేకుండా చూచుకోవాలి. మీకు యెన్నో పర్యాయములు చెప్పాను. నాలుక నాల్గు విధములైన పాపములు చేస్తుందని. ఒకటి

srisathyasaivachanamrutam

అసత్యమాడటం, రెండవది చాడీలు చెప్పటం, మూడవది పరులను దూషించటం, నాల్గవది అతిగా మాట్లాడటం. పక్షులలో కాకి చాలా పాపిష్టి అన్నారు. మృగములలో గాడిద అన్నారు. మనుషులలో యెవరు నీచుడనగా కృతజ్ఞతలేనటువంటివాడు, పరులను దూషించేవాడు.

**మనం కృతజ్ఞులుగా ఉండాలి, కృతఘ్నులుగా తయారుకాకూడదు**

మనము పరులను దూషించరాదు. ఎవరిని మనము పరిహసించరాదు. కృతజ్ఞతను మనము నిరూపించాలి. సూర్యునికి మూడు పేర్లు వుంటున్నాయి. "హిమఘ్నాయ నమః, తమోఘ్నాయ నమః, కృతఘ్నఘ్నాయ నమః" అని. అనగా యేమిటి? తమస్సును దూరము చేసేటువంటివాడు సూర్యుడు. అంధకారమును, అజ్ఞానమును దూరము గావించేటువంటివాడు. హిమఘ్నాయ నమః. కరడుకట్టుకున్నటువంటి హిమాన్నికూడను సూర్యుడు కరగించి ప్రవహింపచేస్తాడు. కృతఘ్నఘ్నాయ నమః, చేసినమేలు మరచేటువంటివాడు. మరచిపోటమేకాకుండా కృతఘ్నుడుగా విరుద్ధముగా మారేటువంటివాడు. అలాంటి వారియొక్క దృష్టిని దూరము చేస్తాడట, సూర్యుడు! "చంద్రమా మనసో జాతః చక్షో సూర్యో అజాయతః" అని. మన కంటిలో సూర్యునియొక్క ప్రతిబింబము వుంటుండాది. ఈ కృతఘ్నుని చూచి "యిలాంటి వాని నేత్రములోనా నేనుండటం, ఛీ! నేనుండను" అని ఆ కృతఘ్నుని దూరంచేసుకొని పోతుందిట, దృష్టి! కనుక మనం కృతజ్ఞునిగా వుండాలి. కృతఘ్నులుగా మనం తయారుకాకూడదు. చేసినమేలు మరువకూడదు. పొందిన ఆనందాన్ని మనము విస్మరించకూడదు. అదే నిజమైన మానవత్వము. ఈ మానవత్వాన్ని మనము పెంచుకోటానికి మన hostel లోపల సరియైన క్రమశిక్షణను మనం పాటించాలి. ఈ మితభావము, తృప్తి దీనిని మనము ప్రయత్నపూర్వకముగా సాధిస్తే యిదే నిజమైన యోగము. ఈ యోగతత్త్వమే మనకు సర్వవిధములైన భోగాల్ని అందిస్తుంది.

విద్యార్థులారా! యీ పదహారునెలలనుంచి యీ Hostelకు నేను రాకపోవటానికి కారణమేమిటి? Discipline ఇక్కడ చెడిపోవటంవల్లనే! కనుక, యీనాటినుండైనా discipline చక్కగా వుంటుండాలి. మీకు యే subject లోనైనా మార్కులు సరిగా



sri sathyasaivachanamrutam

రాకపోయినప్పటికి ఫరవాలేదు. Disciplineలో మాత్రం remarks తేకూడదు. మన Institute లోపల నిజమైన subject, మొట్టమొదటి subject, DISCIPLINE. యింకే subject లోనైనా 'O' grade తెచ్చుకో, యింకా పై గ్రేడు తెచ్చుకో, అది నాకు సంతోషము కాదు. Disciplineలో సరైన grade సాధించినప్పుడే మీ యొక్క జీవితము ఆదర్శవంతమైన జీవితంగా రూపొందుతుంది. అందరూ ఒకరినొకరు ప్రేమించుకొని ఒకరికొకరు సహాయంచేసుకొని, యీ సహాయం అని చెప్పారు కదా స్వామి అని, యిష్టం వచ్చినట్లు మితిమీరిన సహాయం చేయకూడదు. ఎంత అవసరమో, యెప్పుడు యే విధమైన అవసరమో అంత అవసరాన్ని మనము పాటించాలి.

**(తేదీ 22-06-1987న ప్రశాంతినిలయము హాస్టలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam